క్లుప్తంగా

కంభం విజయరాజు పరామర్శ



సోమరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విజయరాజు, పార్టీ శ్రేణులు

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు ఆదివారం పరామర్శించారు. కామవరపుకోట కొత్తూరు గ్రామానికి చెందిన మేడంకి సుబ్బారావు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు ఎంపీటీసీ మేడంకి పద్మ, చిన్నాలను విజయరాజు పరామర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ కార్యకర్త మానికిల నాగేశ్వరావు తండ్రి సోమరాజు ఇటీవల మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులను విజయరాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు నానాది సాగర్, గుర్రాల రవికుమార్, మెరుగు బాబురావు, బందేల ప్రభాకర్ ఆనంద్, బట్ట సుబ్బారావు, మెడంకి బుజ్జి బాబు, చింతపల్లి సుధ, మానుకొండ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం



ఎంపీపీ స్కూల్లో సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన చిన్నారులు

కొయ్యలగూడెం: బోడిగూడెం ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవాన్ని చిన్నారులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో గ్రామస్తులను ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీ రాజర్షి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.

ధ్యానంతో ప్రయోజనాలెన్నో

భీమడోలు: ధ్యానం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ధ్యానంపై దృష్టి సారించి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. భీమడోలులో ఆదివారం ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు జి.అప్పన్న అధ్యక్షత వహించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం వల్ల సత్య సాక్షాత్కారం, స్వీయ సాక్షాత్కారం పెంపొందడం ద్వారా ఆరోగ్యవంతులవుతారన్నారు. జీవిత దృక్పథాన్ని మార్చుకునేందుకు చక్కని మార్గమన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరిగి శారీర రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఒత్తిడి, కోపం, క్లిష్ట పరిస్థితులు తదితర వాటిపై పట్టు సాధిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ మాంసహారాన్ని విడనాడాలని కోరారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ

ఏలూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 7 గంటలకు ఏలూరులో ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ చేపట్టారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు శారీరక శ్రమ అవసరమన్నారు. ఇందుకోసం క్రీడలు, వ్యాయామం, నడక, పరుగు, సైక్లింగ్, స్విమ్మింగ్, యోగా సాధన చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఫిట్ ఇండియా పేరుతో ప్రజల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్విమ్మింగ్ నేషనల్ మెడలిస్ట్ బలగా స్వామి జెండా ఊపడంతో క్రీడాకారులు అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి బయలదేరి నగరంలో ర్యాలీ నిర్వహించారు. సాయ్ సెంటర్ ఇన్‌చార్జి వినాయక్ ప్రసాద్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎం.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కళారత్న, ఉగాది పురస్కార గ్రహీతలకు సత్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆదివారం సాయంత్రం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే కళారత్న (హంస) అవార్డు, ఉగాది పురస్కారాలు పొందిన ఏలూరుకు చెందిన కళాకారులను సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరుకు చెందిన కళాకారులను కళారత్న, ఉగాది పురస్కారాలతో సత్కరించడం ఎంతో గౌరవ సూచికమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ సాంస్కృతిక కళా చరిత్రలో వైఎంహెచ్‌ఏ విశిష్ట స్థానాన్ని కలిగి ఉందన్నారు. కూచిపూడి నృత్య గురువు కళారత్న ఏ.పార్వతి రామచంద్రన్, ఉగాది పురస్కార గ్రహీతలు రంగస్థల నటుడు దువ్వి రామారావు, సాహితీవేత్త జంధ్యాల వెంకట శాస్త్రిలను సత్కరించారు. పరిమి సావిత్రి బృందం శ్రీరామ గానామృతం శ్రోతలను అలరించింది. పార్వతీ రామచంద్రన్ శిష్య బృందం ప్రదర్శించిన హనుమాన్ చాలీసా కూచిపూడి నృత్య రూపకం ఆకట్టుకుంది. వైఎంహెచ్‌ఏ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

జంగారెడ్డిగూడెం: శ్రీరామనవమి పురస్కరించుకుని ఆదివారం వాడవాడలా సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాములోరి కల్యాణాన్ని భక్తులు కన్నులారా తిలకించి తరించారు. జంగారెడ్డిగూడెం పట్టణం బుట్టాయగూడెం రోడ్‌లో వేంచేసివున్న శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పట్టణ ప్రముఖులు బత్తిన చిన్న, పెనుమర్తి రామకుమార్, రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, గుమ్మడి ప్రసాద్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన శ్రీసీతారామస్వామి కల్యాణ మహోత్సవానికి శ్రీ మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం, గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈవో మానికల రాంబాబు ఆధ్వర్యంలో కల్యాణ తంతును వైభవంగా జరిపారు. అలాగే రామచంద్రపురం కోండడ రామాలయంలో, పేరంపేట రోడ్డు పెద్ద, చిన్న రామాలయాల్లో, డిగ్రీ కళాశాల వద్ద, వెలమ పేట రామాలయంలో రాములోరి కల్యాణం నిర్వహించారు. స్థానిక వెంకయ్య స్వామి ఆలయంలో నాగసూరి సుబ్రహ్మణ్యం దంపతులు, పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో కల్యాణం అన్నదానం నిర్వహించారు. మద్ది ఆలయంలో, పట్టణంలోని పలు కూడళ్లల్లో, రామాలయాల్లో చలువ పందిళ్లు వేసి రాములోరి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. గోకుల తిరుమల పారిజాతగిరి భక్తుల తాకిడితో కిటకిటలాడింది. గుర్వాయిగూడెం, జంగారెడ్డిగూడెం, మైసన్నగూడెం, చల్లవారిగూడెం ఆలయాల్లో ఈవో ఆర్‌వీ చందన ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణానికి నూతన వస్త్రాలు, తలంబ్రాలు, ముత్యాలు, ప్రసాదం అందజేశారు.



బుట్టాయగూడెం: దుద్దుకూరులో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు



జంగారెడ్డిగూడెం: విశేషాలంకరణలో సీతారాముల దర్శనం

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు

కొయ్యలగూడెం: శ్రీరామనవమి పురస్కరించుకొని శ్రీ సీతారామ కల్యాణం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శ్రీరామ్‌నగర్ వాటర్ ట్యాంకర్ రామాలయం వద్ద బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ మూర్తి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. తొమ్మిదవ వార్డు రామాలయం వద్ద కల్యాణం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. తూర్పు పేట, పరింపూడి రామాలయాలతో పాటు కన్నాపురంలోని రామాలయం వద్ద కల్యాణోత్సవాలు నిర్వహించారు.

లింగపాలెం: మండలంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ధర్మాజీగూడెం తూర్పు రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ నేత, ఉప్పలపాటి లాలిబాబు దంపతులు, కొన్ని గ్రామాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత, ఉప్పలపాటి వర ప్రసాద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ధర్మాజీగూడెం పడమట రామాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వారికి పట్టువస్త్రాలను బహుకరించారు. లాలిబాబు నాలుగు పంచలోహ విగ్రహాలను ఆలయానికి అందజేశారు. అన్ని గ్రామాల్లో భక్తులకు అన్నసమారాధన.తీర్థప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. రంగాపురంలో సీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహించారు.

అట్టహాసంగా నవమి ఉత్సవాలు

ద్వారకాతిరుమల: మండలంలో వాడవాడలా సీతారాముల కల్యాణ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రజలు ఈ వేడుకలను అట్టహాసంగా జరుపుకున్నారు. అందులో భాగంగా స్థానిక చెరువు వీధిలోని రాణీ చిన్నయమ్మారావు సదనం వద్ద, అలాగే పాత రామాలయం వద్ద, గుడిసెంటర్‌లో, మావులేటి సోమరాజు సదనం వద్ద సీతారాముల కల్యాణాన్ని కమిటీ సభ్యులు అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకాలతో పాటు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. రామ మందిరాల వద్ద రామ నామస్మరణలు మార్మోగాయి.

టి.నరసాపురం: టి.నరసాపురం చిన్న రామాలయం వద్ద ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలు, తలంబ్రాలు మండం ఆదిత్య కుమార్ సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీరం రవి, నల్లూరి శ్రీనివాస్, మాధంశెట్టి రామకృష్ణ, బూబత్తుల రామారావు, శ్యామకూరి రామారావు పాల్గొన్నారు. అలాగే మండలంలో వాడవడల సీతారాముల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. పానకం వడపప్పు పంపిణీ చేశారు. ఆలయాల వద్ద అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గిరిజన పల్లెల్లో సీతారాముల కల్యాణాన్ని పలు ఆలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారామ కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణాపురం రామాలయం వద్ద జరిగిన వేడుకల్లో అనేక మంది భక్తులు సీతారామ కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూల్ సమీపంలోగల రామాలయంలో, అభయాంజనేయస్వామి వారి గుడి వద్ద, దొరమామిడి, రెడ్డిగణపవరం, ముప్పినవారిగూడెం, తెల్లంవారిగూడెంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

చెట్లు మానులకు పూజలు

లక్ష్మీపురంలో నాయక్‌పోడు గిరిజనులు వారి తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ ఆదివారం శ్రీరామనవమి వేడుకల్లో అడవి నుంచి సేకరించిన చెట్ల మానులను సీతారామ లక్ష్మణులుగా తయారు చేసి ఘనంగా పూజలు చేశారు. అత్యంత వైభవంగా 9 రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేలా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. జీలుగుమిల్లి మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. సీతారాముల కళ్యాణ వేడుకల్లో మహిళా భక్తులు పాల్గొని పూజలు చేశారు.

చింతలపూడి: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మండలంలో సీతారాముల కల్యాణాన్ని ఆదివారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో భద్రాచలంలో కల్యాణం నిర్వహించే సమయానికే సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్వామివారి పట్టు వస్త్రాలు సమర్పించారు. మండలంలోని రాఘవాపురం. యర్రంపల్లి, ప్రగడవరం, సీతానగరం, రేచర్ల గ్రామాల్లో, పట్టణంలోని వెలమపేట, ఫైర్‌స్టేషన్ సెంటర్, పాత బస్టాండ్, మెరకవీధి, ఆలపాటి కాంప్లెక్స్ ఆలయాల వద్ద సీతారాముల కల్యాణాలను జరిపించి భక్తులకు పానకాలు పోశారు.

రాముడి గట్టుపై..

చిన్న భద్రాద్రిగా పిలవబడుతున్న యర్రగుంటపల్లి గ్రామంలోని రాముడి గట్టుపై వేంచేసి ఉన్న సీతారాములకు అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తుల జంటలు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. సీతారాములను గ్రామం నుంచి ఊరేగింపుగా రాముడి గట్టు వద్దకు తీసుకువచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రామ భక్తులు కల్యాణాన్ని తిలకించడానికి తరలివచ్చారు. సుమారు 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

కుక్కునూరు: మండలంలోని కుక్కునూరు, కొర్లకుంట, కివ్వాక, మిట్టగూడెం, బంజరగూడెం, మారేడుబాక, వెంకటాపురం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో, కొండపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన, సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు.

వైభవంగా నవమి వేడుకలు

కామవరపుకోట: ఈస్ట్ యడవల్లిలో సీతా రామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. శ్రీరామ చంద్రమూర్తికి ఎదురుగా సీతమ్మవారినీ ఉంచి అర్చకుల వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవార్ల జీలకర్ర బెల్లం పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాలు నడుమ మాంగళ్య ధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు కర్పూర నీరాజనాలు సమర్పించారు. సీతారాముల కల్యాణం తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి విచ్చేశారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలతో పాటు, ఉచిత అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. అలాగే అల్లూరి సీతారామనగర్‌లో యానాదుల కాలనీ నందు వేంచేసినటువంటి సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామివారికి 9 మంది జంటలు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం నిర్వహించారు.



తూర్పు యడవల్లిలో అంగరంగ వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు



జంగారెడ్డిగూడెం : ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, చిన్న



కొయ్యలగూడెం: శ్రీరామ్ నగర్‌లోని రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



లింగపాలెం: ధర్మాజీగూడెం తూర్పు రామాలయం వద్ద సీతారాముల కల్యాణం



ద్వారకాతిరుమల: చెరువు వీధిలోని పాత రామాలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవం



టి.నరసాపురం: చిన్న రామాలయం వద్ద సీతారామ కల్యాణంలో పాల్గొన్న భక్త జన బృందం



బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో జానకిరాముల కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు



చింతలపూడి: యర్రగుంటపల్లిలో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కుక్కునూరు: రామాలయంలో సీతారాముల కళ్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తూర్పు పేటలో ఆధ్యాత్మిక మండప ప్రారంభోత్సవం

కొయ్యలగూడెం: తూర్పు పేటలో స్థానికుల ప్రయోజనార్థం నూతనంగా నిర్మించిన ఆధ్యాత్మిక మండపాన్ని గణపతి యువజన సేవా సంఘం ఉపాధ్యక్షుడు మట్టా సూర్యచంద్రం ఆదివారం ప్రారంభించారు. మాజీ ఉపసర్పంచ్ మట్టా వెంకన్న, గుర్రమ్మల జ్ఞాపకార్థం వైస్ ఎంపీపీ మట్టా వనజాలక్ష్మి, సత్తిపండు దంపతులు రూ.2.50 లక్షలతో మండపాన్ని నిర్మించారు. రామాలయ ఉత్సవాలతో పాటు స్థానిక దేవత చిన్న చింతాలమ్మ ఆలయంలో నిర్వహించే ఉత్సవాలకు మండపాన్ని వినియోగించుకోవాల్సినదిగా దాతలు కోరారు. కల్యాణ మండపం నిర్మించడానికి తమ వంతు సహకరిస్తామని మట్టా బ్రదర్స్ పేర్కొన్నారు. అనంతరం రామాలయం, చిన్న చింతాలమ్మ ఆలయాల కమిటీ సభ్యులు దాతలను సత్కరించి అభినందించారు. మట్టా లక్ష్మీపతి, కరోతు నారాయణరావు, బెల్లాన శ్రీను, రౌతు శ్రీను, మట్టా శ్రీను, జమ్మి చంద్రం, తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక మండపాన్ని ప్రారంభిస్తున్న సూర్యచంద్రం

దుమ్ము రేగుతోంది

కొయ్యలగూడెం: మట్టి లారీల రాకపోకలతో దుమ్ము రేగుతోందని దీంతో శ్వాస కోశ వ్యాధులకి గురవుతున్నామని కన్నాపురం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా కన్నాపురం మెయిన్ రోడ్డు మీదుగా మట్టి లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. రేయింబవళ్లు మట్టి లారీలు వెళుతుండడంతో రోడ్డుపై పడ్డ మట్టి పెళ్లలు వలన రోడ్డు అధ్వానంగా మారింది. విపరీతంగా దుమ్ము లేస్తుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి దుకాణాల మీదకు వాహనాలు దూసుకువస్తున్నాయని ఎప్పుడు ఏమవుతుందోనని బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నామని దుకాణదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై వాటరింగ్ చేయిస్తూ పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



కన్నాపురం మెయిన్ రోడ్డులో దుమ్ము లేపుకుంటూ వెళ్లిపోతున్న మట్టి లారీ

దేవుని మార్గంలో నడుచుకోవాలి

భీమడోలు: క్రైస్తవులంతా దేవునికి ఇష్టులుగా జీవించాలని, ఆయనే మార్గంలో నడుచుకుంటూ పరిపూర్ణ విశ్వాసులుగా ఎదగాలని ఏలూరు మేత్రాసనం ఛాన్స్‌లర్ ఫాదర్ బాబు జార్జ్ అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి నందు 38వ సజీవధారల సువార్త కూడికలు పేరిట ఆరోగ్య మాత మహోత్సవాలు శనివారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ కర్త ఫాదర్ షింటో థామస్ ఆధ్వర్యంలో గురువుల జ్యోతి ప్రజ్వలన చేశారు. బాబు జార్జ్ దివ్య పూజాబలిని అర్పించారు. విశ్వాసులను ఉద్దేశించి వాక్యోపదేశాన్ని అందించారు. కర్నూలు సీనాయి ధ్యాన కేంద్రం అజిష్ దివ్యప్రసాద స్తుతి ఆరాధనను నడిపించారు. కుటుంబమంతా దేవుని పట్ల మంచిగా నడుచుకోవాలని, తద్వారా జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. అనంతరం మోకాళ్లపై ప్రార్థనలు చేశారు. విచారణ కర్త ఫాదర్ షింటో థామస్, డీపాల్ ఫాదర్ నెల్సన్, పంగిడిగూడెం విచారణ కర్త టోనీ, బీడీఎస్ డైరెక్టర్ జింటో, జోసఫ్, విశ్వాసులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరానికి

తరలివెళ్లిన ప్రచార రథం

ద్వారకాతిరుమల: శ్రీవార ధర్మ ప్రచార రథం ఆదివారం రాజమహేంద్రవరంనకు తరలివెళ్లింది. అక్కడ నిర్వహిస్తున్న శ్రీరామ నవమి వేడుకల్లో స్వామివారి ప్రచార రథాన్ని భక్తుల సందర్శనార్థం ఉంచేందుకు పంపినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ముందుగా ఆలయ జంట గోపురాల ప్రాంతంలో ధర్మప్రచార రథానికి ఆలయ ఏఈఓ పి.నటరాజారావు పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం రథం రాజమహేంద్రవరంనకు పయనమైంది. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచారి, శ్రీనివాసాచారి తదితరులున్నారు.

ధర్మప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఏఈఓ →



9 మంది జూదరుల అరెస్ట్

కామవరపుకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేసినట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. నిందితుల నుంచి 8 కోడి పుంజులు, రూ.18,250 నగదు స్వాధీనపరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై చెన్నారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి, ఎం.నాగులపల్లి గ్రామాల్లో కోడిపందేల స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 14 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 13,600 నగదు, 4 కోడి పుంజులు, 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

చింతలపూడి: మండలంలోని ప్రగడవరం గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై చింతలపూడి ఎస్సై కుటుంబరావు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5గురిని అరెస్ట్ చేసి వారి నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, రూ.2,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

నిడమర్రు: మద్యం అక్రమంగా నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వీర ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అడవికొలనులో దాడులు నిర్వహించగా కేతా వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో నిల్వ చేసిన 180 ఎంఎల్ బాటిళ్లు 20 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఉత్సాహంగా 5కే రన్

దెందులూరు: ఆశ్రం హాస్పిటల్స్ కాలేజీ ఆధ్వర్యంలో ఆదివారం 5 కే రన్ నిర్వహించారు. యూరాలజిస్ట్ డాక్టర్ రమేష్ ఆశ్రం యోగా క్లబ్ ఆధ్వర్యంలో ఇది సాగింది. మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రాజు మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, సాంకేతిక పరిజ్ఞానానికి అధిక సమయం కేటాయించడంతో మానవుడి ఆరోగ్యానికి ప్రస్తుతం పూర్తిస్థాయి భద్రత లేదన్నారు. ప్రతి ఒక్కరికి వ్యాయామం, తగిన విశ్రాంతి అవసరమన్నారు.

అన్నసమారాధన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట శ్రీ నూకాలమ్మ అమ్మ వారి ఆలయంలో ఇటీవల ముగిసిన అమ్మవారి 45వ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బడేటి మీనా, ఆలయ కమిటీ చైర్మన్ ధావాల రంగా కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు.